క్లుప్తంగా

బస్సుయాత్రను క్రైస్తవులు విజయవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు దడాల



సమావేశంలో మాట్లాడుతున్న జాషువా గిరి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ నుంచి సోమవారం మధ్యాహ్నం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను కాకినాడ జిల్లాలోని క్రిస్టియన్ మైనార్టీలందరూ విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు దడాల జాషువా గిరి పిలుపునిచ్చారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం మీడియా సమావేశం నిర్వహించారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చర్చిలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. క్రైస్తవ సమాజం మళ్లీ ఆయనను సీఎంగా కోరుకుంటోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెవ.డేవిడ్ లివింగ్ స్టన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884-2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 10.30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

మాజీ కార్పొరేటర్ ర్యాలి రాంబాబు కన్నుమూత



ర్యాలి రాంబాబు (ఫైల్)

కాకినాడ: కాకినాడ కొండయ్యపాలెం ప్రాంతానికి చెందిన మాజీ కార్పొరేటర్ ర్యాలి రాంబాబు శనివారం అర్ధరాత్రి మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ ముఖ్య అనుచరునిగా పేరొందిన ర్యాలి రాంబాబు.. ఒకసారి కౌన్సిలర్‌గా, మరోసారి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఆయన మరణానికి మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు.

విజిలెన్స్ వారోత్సవాలపై ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు


బాలాజీచెరువు: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కుళాయి చెరువు ఆవరణ నుంచి నూకలమ్మ ఆలయం వరకూ ర్యాలీ కొనసాగింది. ముఖ్యఅతిథి బ్యాంక్ రీజనల్ హెడ్ కాకినాడ సాయి మనోహర్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మరో రీజనల్ హెడ్ రంగారావు, రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్ వి.కృష్ణ, జి.నారాయణ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: కాకినాడ పోర్టు ఏరియాలో ఇండస్ట్రియల్ ప్రైవేట్ రైల్వే ట్రాక్‌పై రైలు కింద తలపెట్టి దుమ్ములపేటకు చెందిన సూరాడ అప్పన్న(32) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి సర్పవరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం ప్రకారం.. దుమ్ములపేట జ్యోతుల వారికి వీధికి చెందిన అప్పన్నకు, అదే ప్రాంతానికి చెందిన నూకమ్మతో వివాహమైంది. వీరికి పాప, బాబు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో, మూడు నెలలుగా అతడి భార్య పుట్టింట్లోనే ఉంటోంది. ఒంటరిగా ఉంటున్న అప్పన్న మనస్తాపానికి గురై, ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. సర్పవరం ఎస్సై అజయ్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా సంబరాలు

- కాకినాడ జిల్లా వేదికగా జాతీయ లాన్‌టెన్నిస్ టోర్నమెంట్
- జనవరిలో నిర్వహణకు ఏర్పాట్లు
- వివిధ రాష్ట్రాల నుంచి 300 మంది హాజరు
- ఈ నెల 16 నుంచి ఖోఖో అండర్-17
- పిఠాపురంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ బాల్ పోటీలు



కాకినాడ ఆర్ఎంసీ ప్రాంగణంలోని లాన్‌టెన్నిస్ కోర్టులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడా మౌలిక సదుపాయాల పరంగా రాష్ట్రంలో రెండో పెద్ద జిల్లా కాకినాడ. వివిధ క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు క్రీడా మైదానాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17, 19 ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు విజయవంతగా జరిగాయి. ఈ పోటీల్లో 10 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17, 19 విభాగాలు మరో ముందడుగు వేసి, ఈ ఏడాది జాతీయ స్థాయి అండర్-19 లాన్ టెన్నిస్ పోటీలు కాకినాడలో నిర్వహించేందుకు సన్నద్ధమయ్యాయి. రాష్ట్ర లాన్ టెన్నిస్ సంఘ సహకారంతో నిర్వహించే ఈ పోటీల నిర్వహణకు కాకినాడలో ఆర్ఎంసీ ఆవరణ, డీఎస్ఏ క్రీడా మైదానం, ఆఫీసర్స్ క్లబ్బుల్లోని టెన్నిస్ కోర్టులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. అండర్-19 విభాగంలో జనవరిలో నిర్వహించనున్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ ఖోఖో పోటీలు డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు, క్రీడాధికారులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. అలాగే సాఫ్ట్ టెన్నిస్ అండర్-14, 17, 19 రాష్ట్ర స్థాయి పోటీలు పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూల్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకూ జరగనున్నాయి. ఈ పోటీలకు 450 మంది హాజరవుతారని నిర్వాహకుల అంచనా. ఈ ఏడాది క్రీడలపరంగా ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడవ్వడంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఆస్కారం ఏర్పడింది.

ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు సీఆర్ఆర్ నిధులు నిల్

కాకినాడ జిల్లా పరిశ్రమల పరంగా రాష్ట్రంలో ముందంజలో ఉన్నా, జిల్లాలో పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడల నిర్వహణకు సీఎస్ఆర్ నిధులు లభించకపోవడంతో పోటీల నిర్వహణ భారంగా ఉంటోందనే వాదన వినిపిస్తోంది. నిబంధనల ప్రకారం పరిశ్రమలకు చెందిన నిధుల్లో 2 శాతం సీఎస్ఆర్‌కు కేటాయించాలి. జిల్లాలో క్రీడా పోటీలకు వీటిని అందించాల్సి ఉంది. ఈ ఏడాది పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సీఎస్ఆర్ నిధులు అందలేదని నిర్వాహకులు పెదవి విరుస్తున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి, ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సీఎస్ఆర్ నిధులందేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఈ ఏడాది తొలి అవకాశం



> పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 14, 17, 19 ఆధ్వర్యంలో ఈ ఏడాదే జాతీయ స్థాయి అండర్-19 లాన్ టెన్నిస్ పోటీలు కాకినాడలో నిర్వహించేందుకు అవకాశం వచ్చింది. ఈ పోటీలు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 450 మంది క్రీడాకారులు, క్రీడాప్రతినిధులు హాజరవుతున్నారు. ఇవి జనవరిలో జరగనున్నాయి. పోటీల నిర్వహణకు సుమారు రూ.25 లక్షలు ఖర్చవుతుందని అంచనా. జిమ్నాస్టిక్స్ పోటీలు రాష్ట్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించాం.
> – ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్‌జీఎఫ్ఐ

పారదర్శక ఓటరు జాబితాయే లక్ష్యం

ఈఆర్వో నాగనరసింహారావు



ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని సందర్శించిన కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో పనిచేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లో భాగంగా ఆదివారం ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలను ఈఆర్వో సందర్శించారు. రామారావుపేట, ఎంఎస్ఎన్‌చార్టీస్, పీవీఆర్ ట్రస్ట్ డిగ్రీ కళాశాల, జగన్నాథపురం, చిన్నమార్కెట్ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల ప్రత్యేక శిబిరాల పనితీరును పరిశీలించారు. అక్కడి పోలింగ్ సిబ్బంది, బిఎల్‌వోలకు పలు సూచనలు ఇచ్చారు. దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొత్త ఓట్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత సమయంలోగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఎక్కడా పొరపాట్లకు, లోటుపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, పలువురు అధికారులు, బిఎల్‌వోలు ఉన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి



కరప హైస్కూల్‌లోని ఓటరు నమోదు కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాసరావు

కరప: అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు కోరారు. నడకుదురు, పెనుగుదురు, కరప తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా ఉన్నా, చిరునామా మార్పులు, చేర్పులకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో వీఆర్వో ఏవీఎస్ రామకృష్ణారెడ్డి, బీఎల్‌ఓలు కె.కేశవరావు, కె.సుధీర్‌కుమార్, వి.గాయత్రి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కరప పరిధిలో శని, ఆదివారాల్లో 155 దరఖాస్తులు వచ్చినట్టు వీఆర్వో రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఆ అవినీతికి ఆయనే బాధ్యుడు

- దుగ్గన బాబ్జిపై లారీ యూనియన్ మాజీ కార్యదర్శి గంగబాబు ఆరోపణ



మాట్లాడుతున్న లారీ యజమానుల సంఘ మాజీ కార్యదర్శి చిలుకు గంగబాబు

కాకినాడ: కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుగ్గన బాబ్జి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆయన హయాంలో కార్యదర్శిగా ఉన్న చిలుకు గంగబాబు స్పష్టం చేశారు. అప్పటి లావాదేవీలు అన్నింటికి కర్త-కర్మ-క్రియ అన్నీ దుగ్గన బాబ్జియేనని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లారీ యజమానుల సంఘానికి అధ్యక్షుడు కావడంతో ఆయనపై ఉన్న నమ్మకం, గౌరవంతోనే.. ఆయన చెప్పిన చోటల్లా సంతకాలు చేశానని స్పష్టం చేశారు. పెద్దగా చదువుకోకపోవడం వల్ల అనేక సందర్భాలలో ఖాళీ చెక్కులపై కూడా సంతకాలు తీసుకుని నిధులు వినియోగించారన్నారు. తప్పులన్నీ ఆయన చేసి, లావాదేవీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడం సరికాదన్నారు. లారీ యజమాని ఎండీ అజీమ్ మాట్లాడుతూ దుగ్గన బాబ్జి వేధింపుల వల్లే తాను వ్యక్తిగతంగా నష్టపోయి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడవలసి వచ్చిందన్నారు. పూర్తి దౌర్జన్యంతో, రౌడీయిజంతో వ్యవహరించి ఎంతోమంది ఓనర్లకు ఆయన నరకం చూపించారన్నారు.

సీఎం జగన్ కోసం ప్రార్థించండి



చర్చిలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, క్రైస్తవులు



ద్వారంపూడి కోసం ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

చర్చిలను సందర్శించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో కూడా అధికారం చేపట్టాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి క్రైస్తవులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన రామారావుపేటలోని సిటీ టేబర్నికల్ చర్చి, కలెక్టరేట్ సమీపంలోని క్రైగ్ ఇమ్మాన్యుయెల్ చర్చి, పాతబస్టాండ్ సమీపంలోని మరో చర్చిని సందర్శించారు. అక్కడి క్రైస్తవులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షించే వైఎస్ కుటుంబాన్ని క్రైస్తవులంతా ఆశీర్వదించాలని ద్వారంపూడి కోరారు. క్రైస్తవుల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. చర్చిల అభివృద్ధికి నిధులు, పాస్టర్లకు గౌరవ వేతనంతో పాటు మరెన్నో సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి అధికారంలో కొనసాగితే పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ప్రతి చర్చిలోను వైఎస్ కుటుంబం కోసం, జగన్ కోసం, తన విజయం కోసం ప్రార్థించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీసెల్ కాకినాడ అధ్యక్షుడు పాకా కృపావరం, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి(చినబాబు), స్థానిక నాయకులు లంకే గోపీ, యార్లగడ్డ పద్మజ చౌదరి, నల్లమిల్లి మాచారెడ్డి, బాదం మధు, డీకే రెడ్డి, మిల్లిమి డేవిడ్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కొత్తకాకినాడ ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది టీడీపీ నుంచి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆ ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తెలుగు అప్పారావు, వంకా సింహాద్రి, కోనాడ అబ్బాయి, కె.పాపారావు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరుతున్నట్టు వీరంతా చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో మంచి ఆదరణ కనిపిస్తోందని చెప్పారు. వివిధ వర్గాలకు చెందిన నేతలు పార్టీలో చేరేందుకు చూపిస్తోన్న ఉత్సాహమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చిట్నీడి మూర్తి, మీసాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రపై విస్తృత ప్రచారం



సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రచారానికి కరప నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కరప: కాకినాడలోని సర్పవరం జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జరిగే సామాజిక సాధికార యాత్ర బహిరంగ సమావేశం విజయవంతానికి వైఎస్సార్ సీపీ మండల నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి, అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆదివారం గ్రామాల్లో పర్యటించారు. సామాజిక సాధికార యాత్ర వాల్‌పోస్టర్లు అతికిస్తూ, స్టిక్కర్లు పంచారు. సర్పవరం జంక్షన్ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా పెంకే సత్తిబాబు మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు సభకు హాజరై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చేస్తున్న సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధిని వివరిస్తారన్నారు. మండలంలోని 23 గ్రామాల నుంచి మోటార్‌సైకిళ్లు, ఆటోలలో ర్యాలీగా పెనుగుదురు నుంచి కాకినాడకు వెళ్లి.. ఎమ్మెల్యే కన్నబాబును కలిసి అక్కడి నుంచి సర్పవరం జంక్షన్‌కు తరలివెళతారని ఈశ్వరరావు తెలిపారు. సాధికార యాత్రలో పాల్గొనేందుకు మండలం నుంచి సుమారు 10 వేల మంది స్వచ్ఛందంగా రానున్నారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు జెడ్పీటీసీ సుబ్బారావు తెలిపారు. పార్టీ నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, మద్దూరి భాస్కర్, కొత్త రవి, సింగినేని నాని, అప్పనపల్లి పెద్ద, అడబాల ప్రసాద్, వనుం భాస్కర్, ముద్రగడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంఖవరం: జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన దామోజు లోవకుమార్ (38) ద్విచక్ర వాహనంపై అన్నవరం నుంచి కత్తిపూడి వస్తుండగా సీతంపేట రిఫరల్ ఆసుపత్రి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లోవకుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతిడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భగవత్ స్వరూపమే అవతార్ మోహర్‌బాబా



బాబా జీవితాన్ని వివరిస్తున్న తోట నాగేశ్వరరావు

బోట్‌క్లబ్: మన మధ్య తిరుగుతూ సత్యం, ధర్మం, ప్రేమ తెలియజేసే భగవత్ స్వరూపమే అవతార్ మెహర్‌బాబా అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక రామారావుపేటలోని మెహర్‌బాబా సెంటర్ 68వ వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంకీర్తన గానంతో పాటు బాబా జీవితాన్ని తెలియజేసేలా లఘు నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. మెహర్‌బాబా కాకినాడ సెంటర్ ప్రముఖ్ తోట నాగేశ్వరరావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అంతా కలిసి ఉండాలన్న బాబా సూక్తులను పాటించాలన్నారు. జాయింట్ సెక్రటరీ వల్లూరి గోవిందరాజు, టి.పద్మనాభం, మెహర్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి సహకారం



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ సాదు నరసింహారెడ్డి

బోట్‌క్లబ్: గాంధీభవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అదిస్తానని ఏపీ కస్టమ్స్ శాఖ కమిషనర్ సాదు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గాంధీభవన్‌ను కుటుంబ సమేతంగా సందర్శించారు. తొలుత గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీభవన్ గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు ఉన్నాయన్నారు. కస్టమ్స్ శాఖ సహకారంతో సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలను నిర్వాహకులకు అందిస్తామన్నారు. గాంధీభవన్ నిర్వాహకుడు అల్లూరి సురేంద్ర మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఉచితంగా రీడింగ్ రూమ్‌లను కస్టమ్స్, ఇతర శాఖల సహకారంతో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శివకుమార్, గాంధీభవన్ అధ్యక్షుడు వైఎస్ఆర్ మూర్తి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, సభ్యులు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కొన్నేళ్ల క్రితం తమకు శాశ్వతంగా దూరమైన స్నేహితురాలి సంస్మరణార్థం ఏర్పాటు చేసిన శ్రావణి సేవా సమితి తరఫున యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే విద్యార్థులు ఆదివారం రక్తదానం చేశారు. కాకినాడ బాలాజీ చెరువు కూడలిలో ఉన్న కాస్మో పాలిటిన్ క్లబ్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాస్ హాజరయ్యారు. సుమారు వంద మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ స్నేహితురాలి సంస్మరణార్థం నిర్వహించిన రక్తదానం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. శిబిరం నిర్వహణకు సహకరించిన బొల్లం సతీష్‌ను అభినందించి, సత్కరించారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం నడకుదురులో ఆదివారం కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి టీడీపీ నాయకులతో కలసి పర్యటించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను వివరిస్తూ, మినీ మేనిఫెస్టోను ఇంటింటికీ పంచారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, సీహెచ్ జయేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.